



బళ్లారి జిల్లాలో వరిపంట



బీదర్ జిల్లాలో చెరకు తోట

పంటలు	గతేడాది ల. హెక్టార్లలో..	ప్రస్తుత ఏడాది లక్షల హెక్టార్లలో..
వరి	9.10	10.21
జొన్న	0.45	0.65
రాగి	6.48	7.52
మొక్కజొన్న	16.13	15.91
కంది	13.64	15.94
పెసర	2.04	4.42
వేరుశనగ	3.02	3.32



పంట పండింది..!

● అన్నదాతల్లో ఆనందం ● ఖరీఫ్‌లో సంతృప్తికరంగా దిగుబడులు ● జోరుగా వర్షాలు, సకాలంలో విత్తన పనులు ● నిండుగా జర్వాయర్లు

బెంగళూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలో ఆనందం వెల్లివిరుస్తోంది. నైరుతి రుతుపవనాలకంటే ముందుగానే రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు జిల్లాల్లో ఖరీఫ్ సీజన్‌కు ముందే వ్యవసాయ పనులు ఆరంభమయ్యాయి. దీంతో పాటు రుతుపవనాలు కూడా సకాలంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించడం, నిరంతరంగా వానలు కురవడంతో రైతులు పంటలసాగుకు అనుకూలమైంది. ఇలా ఈ ఏడాది పంటలసాగు విస్తీర్ణం పెరగడంతో గణనీయమైన పంట దిగుబడులు సాధ్యమవుతున్నాయని వ్యవసాయశాఖ ప్రకటించింది. గత ఏడాది 2023లో రాష్ట్రంలో కరువు కొనసాగింది. అయినా 74.32 లక్షల హెక్టార్లలో విత్తన పనులు సాగాయి. ఆ తర్వాత వర్షాభావం కారణంగా అనుకున్నంత స్థాయిలో ఆహార ఉత్పత్తుల దిగుబడి సాధ్యం కాలేదు. ఈ ఏడాది 81.53 లక్షల హెక్టార్లలో విత్తనపనులు సకాలంలో పూర్తయ్యాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 99శాతం వ్యవసాయ పంటలలో ప్రగతి సాధ్యమైంది. ఏటా సరాసరికంటే 9శాతం అత్యధికంగా విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం ఖరీఫ్ కాలంలో అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన పంట కొన్ని ప్రాంతాల్లో దెబ్బతినడం మినహాయిస్తే దాదాపు అన్ని పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రతి పంట దిగుబడి సరాసరిన 50వేల నుంచి లక్ష టన్నులు అధికంగా ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత ఏడాది ఆహార ధాన్యాలు 51.09 లక్షల హెక్టార్లలో విత్తన పనులు సాగి 111.93 లక్షల టన్నుల ఉత్పాదన లక్ష్యం చేరుకుంది. ఈ ఏడాది 57.51 లక్షల హెక్టార్ల విత్తన పనులు సాగగా 112.03 లక్షలు టన్నులు దిగుబడి సాధ్యం కానుందని అంచనా వేశారు. వాణిజ్యపంటలలో గత ఏడాది 74.32 లక్షల హెక్టార్లలో విత్తన పనులు సాగగా ఈ ఏడాది 82.42 లక్షల హెక్టార్లలో విత్తనపనులు సాగాయి.

● చెరుకు 627.20 లక్షల టన్నులు లక్ష్యంగా ఉండేది గత ఏడాది 7.35 లక్షల హెక్టార్లలో చెరుకు సాగు చేయగా 607 లక్షల టన్నుల దిగుబడి సాధ్యమైంది. నూనెగింజలు 7.97 లక్షల హెక్టార్లలో గత ఏడాది సాగు చేశారు. ఈ ఏడాది 8.34 లక్షల హెక్టార్లకు పెరిగింది.

● ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే మార్చి 1 నుంచి మే 31 వరకు సాధారణ వర్షం 115 మిమీకు గాను 151 మిమీ కురిసింది. అదనంగా 31శాతం ఉత్తమ వర్షం సాధ్యమైంది. ఇదే సీజన్‌లోనే వ్యవసాయ పనులు ఆరంభమయ్యాయి. దీంతో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. విత్తన పనులలో బాగల్కోట 108శాతం, బెంగళూరు గ్రామీణ 107శాతం, బెంగళూరు నగర 114, బీదర్ 109శాతం, చిత్రదుర్గ 104, దావణగెరె 104, ధారవాడ 112, గదగ్ 119, హాసన్ 107, కలబురగి 112, కొప్పళ 107, మండ్య 106, మైసూరు 102, రాయచూరు 117, తుమకూరు 107, విజయనగర 101, యాదగిరి 106శాతం విత్తన పనులు సాధ్యమయ్యాయి. ఇలా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వందశాతానికిపైగా విత్తనపనులు సాగాయి. ఇదే ప్రభావం దిగుబడి పెరిగేందుకు కారణమైంది.

● ఖరీఫ్‌లో 50వేల నుంచి లక్ష టన్నుల దిగుబడులు పెరగనున్నాయి. సరాసరిన 81.53 లక్షల హెక్టార్లలో సాగుతో 99శాతం ప్రగతి సాధ్యమైంది. నూనెగింజల పంటలు 8.34 లక్షల హెక్టార్లలో సాగు అయ్యింది.

సకాలంలో వర్షాలతో అధిక దిగుబడి

రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవడంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. గత ఏడాది విత్తన పనులు ఆశాజనకమైనా వర్షాభావంతో ఆశించినంత దిగుబడి సాధ్యం కాలేదు. మరోవైపు వర్షాకాలం ద్వారానే మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగింది.

ప్రాజెక్టులు కళకళ - రబీలోనూ ఆశాజనకం

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రారంభం నుంచే రాష్ట్రంలో ఉత్తమ వర్షాలతోపాటు పొరుగున ఉండే కేరళ, మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా కళకళలాడుతున్నాయి. కొన్నేళ్ల తర్వాత రాష్ట్రంలోని ప్రాజెక్టులు అన్ని పూర్తిగా నిండడంతోపాటు నెలల తరబడి నీటిమట్టం ఏమాత్రం తగ్గకుండా కొనసాగింది. కావేరి నదీ జలాశయాలనుంచి తమిళనాడుకు నీటి విడుదల విషయంలో కోటాతో సంబంధం లేకుండానే భారీగా విడుదల చేశారు. అన్ని ప్రాజెక్టులలో నీరు సమృద్ధిగా ఉండడంతో రబీలో పంటలసాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇప్పటికే రబీ పంట పనులను ప్రారంభించే కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది రబీలోనూ ఉత్తమ పంట దిగుబడులు సాధ్యం కానున్నాయి.



కేఆర్‌ఎస్ డ్యాంలో నిండుగా నీరు

ఈడీ లేఖ రాజకీయ ప్రేరేపితం

● లోకాయుక్తను ప్రభావితం చేయడం సరికాదు
● ముఖ్యమంత్రి సిద్దరామయ్య



బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వివాదానికి సంబంధించి లోకాయుక్త పోలీసులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు లేఖ రాయడం రాజకీయ ప్రేరేపితమని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. మండ్యలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈడీ లేఖ రాయడం కోర్టుపై ప్రభావం చూపాలనే ఉద్దేశమే అన్నారు. ముడా వివాదం కేసు విచారణకు ఈడీ కి ఎటువంటి అధికారం లేదని మరోసారి సీఎం ప్రస్తావించారు. హైకోర్టు సింగిల్‌బెంచ్ తీర్పుపై గురువారం ఫుల్‌బెంచ్ ముందు విచారణకు వస్తున్న తరుణంలోనే ఈడీ లేఖ రాయడాన్ని ఏమని అర్థం చేసుకోవాలన్నారు. చట్టపరంగా ఈ విధంగా చేసేందుకు వీలులేదన్నారు. రాజకీయ ప్రేరేపిత దురుద్దేశంతోనే ఈడీ అధికారులు లోకాయుక్తకు లేఖ రాశారన్నారు. ఈడీ అధికారులు లోకాయుక్తకు పంపిన లేఖలో ముడా బినామీ ఇతరత్రా వ్యవహారాలతో 1095 సైట్‌లు చట్ట వ్యతిరేకంగా మంజూరు చేశారని లేఖలో ప్రస్తావించారు. 1095 సైట్‌ల విలువ రూ.700కోట్ల కంటే ఎక్కువగా ఉందని నిబంధనలకు వ్యతిరేకంగా పంపిణీ చేశారన్నారు. కాగా బుధవారం ఈడీ అధికారుల ముందు ప్రత్యేక భూస్వాధీన అధికారి మంజునాథ్ విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వెళ్లగా 3గంటలకుపైగా విచారణలు జరిపారు.

అక్రమాలను తెలియజేశా


● బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్



బెంగళూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి తీరుపై పార్టీ క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసులకు అనుగుణంగా బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ హాజరయ్యారు. రెండు రోజులుగా ఢిల్లీలో గడుపుతున్న యత్నాళ్ బుధవారం క్రమశిక్షణా కమిటీ ముందు హాజరై గంట సమయం ఉన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఏయే అంశాలు ప్రస్తావించానో అవే వివరాలను క్రమశిక్షణా కమిటీ ముందు తెలిపానన్నారు. పార్టీ అంతర్గత విషయాలు బహిరంగంగా మాట్లాడరాదని కమిటీ సూచించిందన్నారు. కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చానన్నారు. వాటిపై మరిన్ని అంశాలు మాట్లాడలేనని దాటవేశారు. వక్ఫ్‌తోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పోరాటం కొనసాగుతుందన్నారు. మరోవైపు బెంగళూరులో పార్టీ అగ్రనేత యడియూరప్ప మీడియాతో మాట్లాడుతూ.. యత్నాళ్ తమ వారేననీ, ఎందుకో ఆగ్రహంగా ఉన్నారన్నారు. అన్ని సమస్యలను అధిష్టానం పరిష్కరిస్తుందన్న భరోసా ఇచ్చారు. యడియూరప్ప వ్యాఖ్యలను ఢిల్లీలో యత్నాళ్ స్వాగతించారు. యత్నాళ్ తమవారే అంటూ యడియూరప్ప పేర్కొనడంపై సానుకూలంగా స్పందించారు. నాలుగైదేళ్లుగా యడియూరప్ప, ఆయన కుమారుడు విజయేంద్ర పేరు చెబితే ఆగ్రహంతో ఊగిపోయే యత్నాళ్ మాటల్లో ఒక్కసారిగా మార్పు కనిపించింది. క్రమశిక్షణా కమిటీ తీవ్రస్థాయిలోనే యత్నాళ్‌ను మందలించినట్లు తెలుస్తోంది. ఈ కారణంతోనే ఆయన తీరులో మార్పు వచ్చినట్టు కనిపిస్తోంది. కాగా హుటాహుటిన ప్రతిపక్షనేత అశోక్ ఢిల్లీకి వెళ్లడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

అన్నదాత కోసమే మా పోరాటం

● గుడి, బడి.. వక్ఫ్ ఆస్తి ఎలా అయ్యాయి? ● 'మా భూమి-మా హక్కు' పోరాటంలో విజయేంద్ర





బెంగళూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల కోసం ఎంతటి పోరాటమైనా చేస్తామని, వెనుకాడే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర స్పష్టం చేశారు. బీదర్‌లో బుధవారం 'మా భూమి మా హక్కు' పేరిట వక్ఫ్‌బోర్డు నోటీసుల జారీకి వ్యతిరేకంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీగంజ్‌లో ఏర్పాటు చేసిన సభలో విజయేంద్ర మాట్లాడుతూ రెండు మూడు తరాలుగా సాగు చేస్తున్న భూములు ఒక్కసారిగా వక్ఫ్‌కు ఎలా చేరాయని ప్రశ్నించారు. రైతులు, హిందువుల పట్ల సీఎం సిద్దరామయ్య అధికార దర్పం చూపుతున్నారన్నారు. రైతుల కన్నీరు శాపంగా మారనుందన్నారు. రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అధికారం శాశ్వతం కాదని కానీ సమాజంలో కొన్నివర్గాలను టార్గెట్ చేసుకుని ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కొన్ని నెలలక్రితం సీఎం సూచనతో వక్ఫ్‌శాఖ మంత్రి జమీర్‌అహ్మద్ జిల్లా అధికారులతో చర్చలు జరిపి నోటీసులు జారీ చేశారన్నారు. బీదర్ తాలూకా ధర్మాపుర గ్రామమంతా వక్ఫ్ ఆస్తిగా మారిపోయిందని, చట్నళ్లిలో 900 ఎకరాలు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. హిందువులు హత్యకు గురవుతుంటే ముఖ్యమంత్రి నోరు తెరవడం లేదన్నారు. రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే కనీసంగా కూడా స్పందించడం లేదన్నారు. నోటీసులను ఉపసంహరిస్తామని ప్రకటించిన తర్వాత కూడా పలువురు రైతులు నోటీసులు వచ్చినట్టు తెలిపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. ముడా అవినీతిపై పోరాటం చేసినందుకే ప్రస్తుతం కేసులు, విచారణలు సాగుతున్నాయన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో 93 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని శాసనసభలోనే అంగీకరించారన్నారు. బోవి కార్పొరేషన్‌లో అవినీతికి ఇటీవలే మహిళా న్యాయవాది ఆత్మహత్య విషయం తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అశ్వత్థనారాయణ మాట్లాడుతూ 1975నాటి వక్ఫ్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, రైతుల పేర్లు మాత్రమే ఈసీలో ఉండాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రి బైరతి బసవరాజ్, ఎమ్మెల్యేలు శైలేంద్ర, సిద్దలింగప్ప పాటిల్, శరణు సలగార, ఎంజి ములె, రేణుకాచార్య, ప్రకాశ్‌ఖండ్రె, బసవరాజ్ మత్తిమూడుతోపాటు పలువురు పాల్గొన్నారు. గాంధీగంజ్ నుంచి డీసీ కార్యాలయం దాకా భారీగా ఊరేగింపు చేశారు. చెరుకుగడలతో రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయేంద్ర, ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ముల్లంగి ధరపై హర్షం

హోసూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు ముల్లంగి మంచి దిగుబడితోపాటు కనీసధర ఉండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలైన బాగలూరు, ఉద్దనపల్లి, ఆవలపల్లి, కెలవరపల్లి, శూలగిరి, పరిసర ప్రాంతాల్లో రైతులు తక్కువ కాలంలో పండే ముల్లంగి, టమోటా, బచ్చలికూర, కొత్తిమీర వంటి కూరగాయలు పంటలను పండిస్తున్నారు, ఇక్కడ పండించే పండ్లు, కూరగాయలను బెంగళూరు, సేలం, ఈరోడ్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. కేవలం 45 రోజుల్లో చేతికొచ్చే ముల్లంగి పంట ఈసారి నాణ్యతతో దిగుబడి ఉండడంతో స్థానికంగా రిలయన్స్, టి మార్ట్, స్మార్ట్ బజార్ వంటి వాటికి సైతం విక్రయిస్తున్నారు. తోటల వద్ద కిలో రూ.20-25 చొప్పున కొనుగోలు చేసి మాల్స్, రైతు బజారులో రూ.35-40 వరకు ధర పలుకుతోంది. భారీ వర్షాలతో పంట నష్టపోతుందని భావించిన తరుణంలో చక్కటి దిగుబడి, కనీస ధర పలుకుతుండడంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతోంది.



మార్కెట్‌కు తరలిస్తున్న ముల్లంగి

హిందువులకు రక్షణ కల్పించాలి

● బంగ్లాదేశ్‌లో దాడులపై ప్రధాని మోదీ స్పందించాలి ● హిందూ సంఘాల డిమాండ్ ● బెంగళూరు, బళ్లారిలో నిరసన



ఫ్రీడం పార్కులో ప్లకార్డులతో నిరసన

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ హిందూసంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. ఫ్రీడంపార్కులో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో హిందూ హితరక్షణా సమితి ఆధ్వర్యంలో మద్దతుగా వివిధ సంఘాల సభ్యులనుంచి సంతకాల సేకరణ చేపట్టారు. బంగ్లాదేశ్ హిందువులను రక్షించాలని, హిందువుల మనోభావాలతోపాటు భౌతిక దాడులను నియంత్రించాలని నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందువుల ఆలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ హిందువులపై దాడులపై ప్రధాని మోదీ స్పందించాలన్నారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఇస్కాన్ గురువులతోపాటు హిందు హిత రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

బళ్లారి బంద్ విజయవంతం

బళ్లారి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం బళ్లారిలో దేశభక్తి నాగరిక వేదిక, ఆర్‌ఎస్‌ఎస్, ఇతర హిందూ సంఘాలు చేపట్టిన నగర బంద్ విజయవంతం అయింది. వేలాది మంది స్వచ్ఛందంగా నిరసనలో పాల్గొన్నారు. ముందుగా వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీగా రాయల్ సర్కిల్ వరకు చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బళ్లారి మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువుల పై దాడులు చేస్తుంటే ఊరుకునేందుకు హిందువులేమీ చేతకాని వారు కాదన్నారు. అవసరం అయితే దేశంలో హిందువులంతా పాదయాత్రతో బంగ్లాదేశ్ వెళ్లేందుకు వెనుకాడేది లేదన్నారు. నిరసనలో బీజేపీ నాయకులు జేఎస్ దివాకర్, శ్రీనివాస్ మోత్కర్, ఐనాత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోవిందరాజులు, సిద్దారెడ్డి, మినయ్‌కుమార్, తదితర దేశభక్తి నాగరిక సమితి సభ్యులు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, సభ్యులు, హిందూ మద్దతు సంఘాలు, మహిళలు పాల్గొన్నారు. బంద్ కారణంగా దుకాణాలు మూతబడ్డాయి. ప్రపంచంలోని హిందువులను కాపాడుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. హిందువుల ఇళ్లలోకి చొరబడి మగవాళ్లను చంపడం, ఆడవాళ్లను ఎత్తుకెళ్లి దారుణంగా హింసించి చంపుతుండడం దారుణమైన విషయమన్నారు. ఒకప్పుడు అన్నపెట్టిన ఇస్కాన్ పై దాడులు చేయడం, ఇస్కాన్ గురువును హింసించడం హిందువుల మనోవేదనకు కారణమయ్యిందన్నారు. వేలాది మంది హిందువులు స్వచ్ఛందగా పాల్గొని బాంగ్లాదేశ్ లో జరుగుతున్న హింసను ఖండించారు. దేశభక్తి నాగరిక వేదిక సంచాలకులు సీఏ శరణ పాటిల్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దాడులను ఎదురించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాలి



రాయల్ సర్కిల్లో హిందూసంఘాల మానవహారం

భారత ఫుట్‌బాల్ ప్రాబబుల్స్‌కు అనూష

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అండర్-20 భారత మహిళా జట్టు ప్రాబబుల్స్‌కు జిల్లాకు చెందిన క్రీడాకారిణి అనూష ఎంపికయ్యారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన అనూష ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇప్పటికే ఆమె అనేక రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. గతేడాది కూడా అండర్-19 భారత మహిళా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌లో ఆమె చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీలో రెసిడెన్షియల్ సాధన చేస్తున్నారు. భారత జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపిక కావడంతో బెంగళూరులో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి వెళ్లారు. అనూషాను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ అభినందించారు.



అనూష

రోశయ్యకు భారతరత్న ప్రకటించాలి

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు గోపా మచ్చా నరసింహులు



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఆర్యవైశ్య మహాసభ నాయకుడు, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు డిమాండ్ చేశారు. కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణమండపంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోశయ్య జన్మించిన గుంటూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్‌లోని వైశ్య హాస్టల్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి టంగుటూరు నాగభూషణ, సత్రసాల కిషోర్, తల్లం మురళీకృష్ణ, కృష్ణం రఘు, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

హనకనహాళ్‌లో ప్రబలిన జ్వరాలు

కణేకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ గ్రామంలో జ్వరాలు ప్రబలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి గ్రామంలో జ్వరాల తీవ్రత పెరిగింది. దీంతో బాధితులు చికిత్స కోసం బెళుగుప్ప, కళ్యాణదుర్గం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, వరుణ్‌తేజ్, జ్యోత్స్న, తిమ్మరాజు తదితరులకు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు రావడంతో కళ్యాణదుర్గంలో చికిత్సలు పొంది బుధవారం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లోను జ్వర పీడితులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



జ్యోత్స్న



రామాంజనేయులు



తిమ్మరాజులు



వరుణ్‌తేజ్

ఆ పాఠశాల విద్యార్థులు బరిలోకి దిగితే పతకం కొట్టాల్సిందే. ప్రత్యర్థి ఎవరైనా విజయం మాత్రం వారిదే. ఇదేదో పట్టణాలు, నగరాల్లో పేరొందిన కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల ప్రతిభ మాత్రం కాదు. జిల్లాలోని మారుమూల గ్రామం నూతిమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటల్లో అద్భుతమైన ప్రతిభ చూపుతున్నారు. పీడీ కోచింగ్, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పతకాలు పట్టేస్తున్నారు. మెరుగైన ఆటతీరుతో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఈ పాఠశాల విద్యార్థులు 43 మంది అద్భుత ప్రదర్శన చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. -ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం



మట్టిలో మాణిక్యాలు

ఆట ఏదైనా విజయం వారిదే..



ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నూతిమడుగు పాఠశాల విద్యార్థులు

రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు

క్రీడల్లో రాణిస్తున్న నూతిమడుగు విద్యార్థులు





జాతీయ స్థాయిలో ఆడుతా: ఖాసీం, తొమ్మిదో తరగతి

ఈ ఏడాది వాలీబాల్, సాఫ్ట్‌బాల్ గేమ్‌లలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో సాఫ్ట్‌బాల్ గేమ్‌లో జాతీయ జట్టులో స్థానం సంపాదించడం లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా. ఎప్పటికైనా జాతీయ స్థాయిలో ఆడుతా.



మెడికల్ సీట్ సంపాదించడమే లక్ష్యం

సాఫ్ట్ బాల్ గేమ్‌లో మూడు సార్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నా. మా పీడీలు ఓబులేసు, సంజీవరాయుడు ఇచ్చిన శిక్షణతో జాతీయ స్థాయిలో కూడా ఒకసారి పాల్గొన్నా. భవిష్యత్తులో క్రీడల ద్వారా మెడికల్ సీట్ సంపాదించటమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా.

-ఆశాబేగం, తొమ్మిదో తరగతి



మూడుసార్లు రాష్ట్రస్థాయిలో ఆడా

సాఫ్ట్ బాల్ గేమ్‌లో మూడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ జట్టులో స్థానం కోసం ప్రాక్టీస్ చేస్తున్నా. పీడీలు ఓబుళపతి, సంజీవరాయుడు నాతో రోజు ప్రాక్టీస్ చేయించి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా తీర్చిదిద్దారు.

-వసంత్, పదో తరగతి



ఖోఖోలో జాతీయస్థాయిలో రాణిస్తా

ఈ నెల 6 నుంచి 8 వరకు చిత్తూరులో జరిగే ఖోఖో రాష్ట్రస్థాయి అండర్-19 పోటీల్లో పాల్గొనబోతున్నా. అక్కడ బాగా రాణించి జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా.

-ప్రణవి, ఎనిమిదో తరగతి

అందరూ గ్రామీణ విద్యార్థులే

ఈ పాఠశాల్లో చదివే విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంత విద్యార్థులే. ఈ పాఠశాల పరిధిలో ఏడు మారుమూల గ్రామాల పరిధిలోని విద్యార్థులు ఉన్నారు. ఈ పిల్లలు కేవలం చదువులోనే కాకుండా ఆటల్లో సైతం ఆసక్తి కనబరిచి, వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులు ప్రతిరోజు పలు క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తుంటారు. ప్రతి రోజు మధ్యాహ్నం తర్వాత పలు క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తుంటారు. నిత్య సాధనతోనే విజయాలు సాధ్యమవుతున్నాయని పాఠశాల పీడీలు చెబుతున్నారు.


విజయాల వెనుక ఇద్దరు పీడీలు

ఒకప్పుడు ఈ పాఠశాలలో పిల్లలకు ఆసక్తి ఉన్నా క్రీడలకు అంతగా ప్రాధాన్యం ఉండేది కాదు. పీడీలు ఉన్నా ఏదో సాధారణంగా గడిచిపోయేది. కాని రెండేళ్ల కిందట ఇక్కడ పీడీలుగా ఓబుళపతి, సంజీవరాయుడు బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆటల్లో పాఠశాల తీరే మారిపోయింది. వారిద్దరూ కలిసి మట్టిలో మాణిక్యాలను గుర్తించి, తమ శిక్షణతో సానపట్టారు. దాని ఫలితమే ఇప్పుడు వస్తున్న పతకాలు అని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వివిధ క్రీడల గురించి, అందులోని మెలకువల గురించి ఎప్పటికప్పుడు వివరించి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటేలా చూస్తున్నారు. ఇదే స్ఫూర్తితోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించగలమని విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పేర్కొన్నారు. అయితే పాఠశాలకు సరైన మైదానం లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. దాతలు ముందుకు వచ్చి క్రీడామైదానాన్ని బాగు చేయించి, క్రీడలకు సహకరిస్తే ఇక్కడి విద్యార్థులు అద్భుతాలు చేయగలరని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రెండేళ్ల నుంచి రాష్ట్రస్థాయికి 70 మంది..

గత రెండేళ్ల నుంచి ఈ పాఠశాల్లో విద్యార్థిని, విద్యార్థులు 70 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బ్యాల్, ఆర్చరీ (విలువిద్య), వెయిట్ లిఫ్టింగ్ తదితర క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై ఈ పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కూడా నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి గుర్తింపు పొందారు. గత రెండుమూడేళ్లలోనే దాదాపు 250 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై అక్కడ కూడా అత్యున్నత ప్రతిభాపాటవాలు సాధించారు. 8, 9, 10 వ తరగతికి చెందిన 44 మందికి పైబడి బాలురు, 30 మందికి పైబడి బాలికలు కూడా వివిధ ఆటల్లో తమ ప్రతిభ చూపుతున్నారు. బాలికలు కూడా బాలురతో సమానంగా క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం ఇక్కడ విశేషం.





70 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడారు

నేను, ఇక్కడ పనిచేసే మరో పీడీ సంజీవరాయుడు ఇద్దరం రెండేళ్ల కిందట ఈ పాఠశాలకు వచ్చాం. అప్పటి నుంచి సుమారు 70 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఒక అమ్మాయి జాతీయ స్థాయి జట్టుకు ఎంపికయ్యింది. ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, ఆర్చరీ (విలు విద్య), వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో రెండేళ్ల నుంచి తర్ఫీదు ఇస్తున్నాం. ఆర్చరీ వంటి పురాతన క్రీడ ఈ పాఠశాలలో ఉండటం ఒక విశేషం. ఎంతో ఖరీదైన ఆటలు అయిన ఆర్చరీ, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ఈ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషించదగ్గ విషయం.

- ఓబులేసు, పీడీ, ఉన్నత పాఠశాల, నూతిమడుగు, కంబదూరు మండలం

అడ్మిషన్ దొరికితే చాలు

పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 716 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో అడ్మిషన్ దొరికితే చాలని తల్లిదండ్రులు ఎగబడుతుంటారు. ఈ ఏడాదే అన్ని తరగతుల్లో కలిపి 270 మంది అడ్మిషన్ పొందారు. దీన్నిబట్టే పాఠశాల స్థాయిని తెలుసుకోవచ్చు. క్రీడలతో పాటు, చదువులో కూడా పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, పాల్‌టెక్నిక్, ఏపీఆర్‌జేసీ, ఆర్డీటీ సెట్‌లో కూడా ఉత్తమ ప్రతిభ చూపి పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారు. పదో తరగతిలో కూడా మంచి ఫలితాలు వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పడానికి ఆసక్తి చూపుతున్నారు.

దాతలు సహకరించాలి

నేను రెండేళ్ల నుంచి హెచ్‌ఎంగా ఈ పాఠశాలలో పనిచేస్తున్నా. పీడీలు ఓబుళపతి, సంజీవరాయుడు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, మంచి శిక్షణ ఇవ్వడంతోనే ఇంతటి విజయానికి సాధ్యం అయింది. దాతలు ముందుకు వచ్చి మరింత క్రీడాసామగ్రిని సమకూర్చినట్లయితే జాతీయ స్థాయిలో విద్యార్థినీవిద్యార్థులను తీసుకెళ్లేందుకు కష్టపడతాం.

-రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం



కోతలు లేని విద్యుత్ సరఫరా

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోతలు లేని విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈలు సంపత్‌కుమార్, సురేంద్రతో కలిసి ఆయన అన్ని అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయలను పూర్తిగా నివారించాలన్నారు. వేసవి ప్రారంభంలోపు వినియోగదారులకు కరెంటు సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరం మేరకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. పాత లైన్ల స్థానంలో కొత్త లైన్ లాగేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ కలెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సామగ్రి ఈనెల చివరికి వస్తుందన్నారు. అప్పటికి ఎస్టిమేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్, ఈఈలు ప్రసాద్, రాజశేఖర్, జేవీ రమేష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు డీపీఆర్సీలో శిక్షణ

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5,6 తేదీల్లో జడ్పీ కార్యాలయంలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో రెండు బ్యాచ్‌లకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి ట్రైనర్లు అయిన ఈవోఆర్డీలు, పంచాతీయ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాస్థాయి శిక్షణ తర్వాత ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకూ మండలాల్లోని ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



మజ్దూర్ యూనియన్ శిబిరం



ఎంప్లాయిస్ సంఘ్ శిబిరం

ప్రారంభమైన రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికలు

గుంతకల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కార్యక్రమం బుధవారం ప్రారంభం అయ్యింది. రైల్వే ఉద్యోగుల ఓటింగ్ కార్యక్రమం ఈనెల 4, 5, 6 తేదీల్లో చేపట్టనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో 6 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డివిజన్‌లో 14,359 ఓట్లు ఉండగా, సాయంత్రందాకా నిర్వహించిన పోలింగ్‌లో 7,591 ఓట్లు పోలయ్యాయి. మొదటి రోజు సాయంత్రానికి 52.87 శాతం పోలింగ్ నమోదైనట్టు పర్సనల్ శాఖాధికారులు తెలియజేశారు. పోలింగ్ సందర్భంగా రైల్వే ఏరియాలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యాల్లో ఓటింగ్ సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకూ రైల్వే ఇన్‌స్టిట్యూట్, డీఆర్ఎం కార్యాలయాల వద్ద ఉద్యోగుల కోలాహలం కనిపించింది. ఓటింగ్ కార్యక్రమాన్ని డీఆర్ఎం విజయ కుమార్, సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, తదితర ఎన్నికల అధికారులు, యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ కే మల్లికార్జున, తదితరులు పర్యవేక్షించారు.

తెగుళ్ల ఉధృతి

కందికి పచ్చపురుగు, పప్పుశనగకు వేరుకుళ్లు

ఆవిరవుతున్న రైతన్న ఆశలు







కందిపూత దశలోనే ఆశించిన పురుగు, కాయను తొలుస్తున్న పచ్చపురుగు, వేరుకుళ్లు తెగులుతో నాశనమైన పప్పుశనగ

బెళుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండటంతో కంది, పప్పుశనగ రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. పూత దశలో ఉన్న కంది పంటను పచ్చపురుగు ఆశించింది. పూత, పిందెలను తినేస్తోంది. నివారణకు వేలాది రూపాయలు వెచ్చించి పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. పురుగు నివారణకు క్లోరంట్రినిల్‌ప్రోల్ ఎకరాకు 60 ఎంఎల్ లేదా సైనోశాడ్ 60 ఎంఎల్, ప్రొటానోపాస్ 400 ఎకరాకు 400 ఎంఎల్, బెంజోయెట్ ఎకరాకు 80 ఎంఎల్ మందులు పిచికారి చేయాలని వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ సూచించారు. మండలంలో 16,600 ఎకరాలలో పప్పుశనగ సాగు చేశారు. అయితే తేమ అధికావడంతో వేరుకుళ్ల వ్యాధి సోకి మొక్కన్నీ చనిపోతున్నాయి. నివారణకు సాఫ్ లేదా హెక్సా కోనజోల్ లేదా ప్రొపికోనోజోల్ ఎకరానికి 400 గ్రాముల పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. మొక్క పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలని, తేమశాతం ఎక్కువగా ఉన్నందున మొక్కల వేళ్లు నల్లగా వుండి పైరు నాశనమవుతోందని ఏవో తెలిపారు.

ఆశలన్నీ నీరుగారుతున్నాయి



కంది, పప్పుశనగ పంటలపై పెట్టుకున్న ఆశలన్నీ నీరుగారుతున్నాయి. కందికి పచ్చపురుగు, పప్పుశనగకు వేరుకుళ్లు సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. 30 ఎకరాల్లో కంది, 20 ఎకరాల్లో పప్పుశనగ పంటలు సాగు చేశా. వర్షాలు కురిసినా ప్రయోజనం లేకుండా పోయింది. దిక్కుతోచడం లేదు. దేవుడు కరుణించి వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కే అవకాశం ఉంటుంది. **-యర్రిస్వామి, రైతు, ఎర్రగుడి**

చిరస్మరణీయుడు ఘంటసాల

వెంకటేశ్వరరావుకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహం వద్ద కళాకారుల నివాళి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి): తన గాన మాధుర్యంతో తెలుగు సినీ సంగీత ప్రియులను అలరించిన ఘంటసాల చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు. ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఘంటసాల పాడిన పాటలను ఆలపిస్తూ అలనాటి మధురస్మృతులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్, అస్లాం బాషా, సురభి ఆనంద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

● హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్కులోని ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పాతపాటల ప్రేమికుల సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాయనీ గాయకులు ఘంటసాల పాటలు ఆలపిస్తూ స్వరనీరాజనం పలికారు. కార్యక్రమంలో పాతపాటల ప్రేమికుల సంఘం నాయకులు జీవి రామయ్య, ఓబుళదాస్, పాలసముద్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ముందస్తు ప్రవేశాలు కల్పిస్తే చర్యలు: ఆర్ఐఓ

అనంతపురం విద్య, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ కళాశాలల్లో ముందస్తు ప్రవేశాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ హెచ్చరించారు. నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజ్‌లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను, ఇతర ఫైళ్లను పరిశీలించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేయకముందు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఎవరూ ముందస్తు అడ్మిషన్లు చేపట్టకూడదన్నారు. ఎవరైనా అడ్మిషన్లు చేస్తే బోర్డు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. 2025 మార్చి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈ నెలా 5లోపు చెల్లించేలా చూడాలని ఆయన ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 2025 ఫిబ్రవరి మొదటివారంలో ఇంటర్ ప్రాక్టికల్స్ ఉంటాయని, అన్ని యాజమాన్య కళాశాలల ప్రిన్సిపాళ్లు జనవరి 31లోగా సిలబస్, ప్రయోగాలు పూర్తి చేయాలని, రికార్డులను సర్థిపై చేయాలని ఆదేశించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్వామి జ్ఞానానంద (జయంతి)



స్వామి జ్ఞానానంద 1896 డిసెంబరు 5న పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం సమీపాన గొరగనమూడి (ప్రస్తుతం పాలకోడేరు మండలం)లో జన్మించారు. అసలు పేరు భూపతిరాజు లక్ష్మీనరసింహ రాజు. యోగిగా, భౌతిక శాస్త్రవేత్తగా పేరొందారు. గౌతమబుద్ధుడి జీవితంతో స్ఫూర్తిపొంది హిమాలయాల్లో పదేళ్లపాటు యోగా, వేదాలపై అధ్యయనం చేశారు. 'పూర్ణ సూత్రాలు' గ్రంథాన్ని రచించి ప్రసంగాలు చేశారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ అందుకున్నారు. జేమ్స్ చాడ్విక్‌తో కలసి పరమాణు భౌతిక విజ్ఞానశాస్త్రంలో పలు పరిశోధనలు చేసి లండన్‌లో ఫెలోషిప్, అమెరికాలో పురస్కారాలు అందుకున్నారు. 1969 సెప్టెంబరు 21న కన్నుమూశారు. వైజాగ్‌లోని ఆంధ్రా యూనివర్సిటీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

వాల్ట్ డిస్నీ (జయంతి)




హాలీవుడ్‌లో పేరొందిన దర్శక, నిర్మాత 'మిక్కీ మౌజ్' రూపకర్త వాల్టర్ ఎలియాస్ డిస్నీ 1901 డిసెంబరు 5న జన్మించారు. కథా రచయిత, డబ్బింగ్ కళాకారుడిగా వ్యాపారవేత్తగాను రాణించారు. యానిమేషన్ చిత్రాలద్వారా ఆ రంగానికి అంతర్జాతీయ గుర్తింపు కల్పించారు. కార్టూన్‌ల నిర్మాణంలో ఎన్నో వినూత్నమైన పద్ధతులు ప్రవేశపెట్టారు. 59సార్లు నామినేట్ కాగా 22 ఆస్కార్ అవార్డులతో రికార్డు సృష్టించారు. డిస్నీల్యాండ్ అనే అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను ఆయన ఏర్పాటు చేశారు. 1966 డిసెంబరు 15న కన్నుమూశారు.

చాట్ల శ్రీరాములు (జయంతి)



తెలుగు నాటకరంగ కళాకారుడు, సినీనటుడు చాట్ల శ్రీరాములు 1931 డిసెంబరు 5న బెజవాడలో జన్మించారు. వందకుపైగా నాటకాలలో నటించి దర్శకత్వం వహించారు. 'మరో మొహంజదారో' నాటకం ప్రసిద్ధి చెందింది. లండన్‌లోని బ్రిటీష్ డ్రామా లీగ్‌లో 1970లో నాటక ప్రయోక్తగా, ఆచార్యుడిగా శిక్షణ పొందారు. తెలుగుచలనచిత్ర పరిశ్రమలోని ఎందరో నటీనటులకు శిక్షణ ఇచ్చారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం, ఉస్మానియా తదితర విశ్వ విద్యాలయాలు తమ నాటకరంగ శాఖలకు విభాగాధిపతిగా నియమించాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు. 2015లో కన్నుమూశారు.

శ్రీ అరబిందో (వర్ధంతి)



ప్రముఖ తత్వశాస్త్ర శ్రీ అరబిందో ఘోష్ 1872 ఆగస్టు 15న కోల్కత్తాలో జన్మించారు. ఆధ్యాత్మిక భావాలతో యోగి, గురువుగా పేరొందారు. ఆయన రూపొందించిన ప్రత్యేక విధానాన్ని ఇంటిగ్రల్ యోగాగా పిలుస్తారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. మానవ వికాస తత్వశాస్త్రం, మానవత్వ విలువలతో నాయకులను ప్రభావితం చేశారు. ది లైఫ్ డివైన్, ది సింథసిస్ ఆఫ్ యోగా వంటి రచనలు ఎంతో పేరొందాయి. పాండిచ్చేరిలో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. 1950 డిసెంబరు 5న కన్నుమూశారు.

నెల్సన్ మండేలా (వర్ధంతి)



నల్లజాతి సూరీడుగా ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన నెల్సన్ మండేలా 1918 జూలై 18న దక్షిణాఫ్రికాలో జన్మించారు. పూర్తిస్థాయి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన మొట్టమొదటి నాయకుడు 1994 నుంచి 1999వరకు అధ్యక్షుడిగా కొనసాగారు. అంతకుముందు జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. నోబెల్ శాంతి పురస్కారంతోపాటు ఇండియా నుంచి అత్యున్నతమైన 'భారతరత్న', ప్రపంచవ్యాప్తంగా 250కుపైగా గౌరవాలు అందుకున్నారు. దక్షిణాఫ్రికాలో 'ది ఫాదర్ ఆఫ్ ది నేషన్'గాను, 'ది ఫౌండింగ్ ఫాదర్ ఆఫ్ డెమోక్రసీ'గాను పేరొందారు. 2013 డిసెంబరు 5న కన్నుమూశారు.

జయలలిత (వర్ధంతి)




తమిళనాడు రాష్ట్రానికి ఆరుసార్లు ముఖ్యమంత్రిగా కొనసాగిన జయలలిత 1948 ఫిబ్రవరి 24న కర్ణాటక రాష్ట్రం మైసూరు ప్రాంతంలో జన్మించారు. ప్రజారంజక పాలనతో 'అమ్మ'గా, 'పురచ్చి తలైవి'గా పిలవబడ్డారు. 1991 నుంచి 2016 వరకు ఆరు సార్లు సీఎంగా ఉన్నారు. సినీనటి, ఏఐఏడీఎంకే పార్టీలో పలు కీలక హోదాలలో కొనసాగారు. రాజకీయాల్లోకి రాకముందు తమిళ చిత్రసీమలో మకుటం లేని మహారాణిగా ఏలారు. తమిళ, తెలుగు, కన్నడలో 140కుపైగా సినిమాలలో నటించారు. 2016 డిసెంబరు 5న కన్నుమూశారు. సీఎంగా కొన సాగుతూ తుదిశ్వాస వీడిన తొలి మహిళా సీఎంగా నిలిచారు.

గులాం అలి (పుట్టినరోజు)



పాకిస్థానీ గజల్ గాయకుడు ఉస్తాద్ గులాం అలి 1940 డిసెంబరు 5న లాహోర్‌లో జన్మించారు. పాటియాలా ఘరానా ఆలాపనలో పేరొందారు. హిందూస్థానీ క్లాజికల్ శైలిలో ఘజల్స్ ఆలపించేవారు. పాకిస్థాన్, ఇండియా, నేపాల్ బంగ్లాదేశ్ ఇలా ఎన్నో దేశాల్లో పేరొందారు.

శిఖర్ ధావన్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ శిఖర్ ధావన్ 1985 డిసెంబరు 5న ఢిల్లీలో జన్మించారు. ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా రాణించారు. ఢిల్లీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ, ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ తరఫున ఆడారు. వన్డేల లోనూ, 20-ట్వంటీ మ్యాచ్‌లలోనూ సత్తా చాటుకు న్నారు. 2019నాటికి 24 ఇంటర్నేషనల్ సెంచరీలు చేశారు. అర్జున అవార్డుతో పాటు పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. 2022లో 200వ మ్యాచ్ ఆడి 6వేల పరుగులు పూర్తి చేయడంతో విరాట్‌కోహ్లి తర్వాత ఈ మైలురాయిని అందుకున్న రెండో క్రికెటర్‌గా నిలిచారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

హొసమనే గ్రామస్థుల డిమాండ్.. ఎంపీ తీరుపై ఆగ్రహం



బురదరోడ్డుపై నాట్లు వేసి గ్రామస్థుల నిరసన

బంగారపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఎంపీ మల్లేశ్‌బాబు గెలుపొందాక అమలు చేయడంలో విఫలమయ్యారని గ్రామాల సమస్యలను పట్టించుకోలేదని ఏ హొసమనె గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలూకాలోని కేతగానహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని ఏ హొసమనె గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవారం మట్టిరోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా గ్రామాల్లో కనీస సదుపాయాలు లేవని విచారం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో గెలుపొందినవారు నెలలు గడిచినా కనీసంగా స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించదలిచామని ప్రకటించారు. గోవిందరాజు మాట్లాడుతూ గ్రామంలో ఎస్టీ బోవి సముదాయానికి చెందినవారు పెద్దసంఖ్యలో ఉన్నారని మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. మూగినహళ్ళి, తండేగమిట్ట, దొడ్డేరి, పరమానహళ్ళి, ఏ అండ్ బి హొసమనెగళ గ్రామాలను అనుసంధానం చేసే రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు. మల్లేశ్‌బాబు రెండుసార్లు శాసనసభ, ఒకసారి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా నియోజకవర్గంలోని గ్రామాల ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. ప్రధానమంత్రి గ్రామీణాభివృద్ధి పథకం కింద 2023-24 సంవత్సరానికి రూ.7లక్షలు మంజూరైనా ఇంతవరకు రోడ్డును బాగు చేయలేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించక పోతే పోరాటాన్ని తీవ్రతరం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించనున్నట్టు హెచ్చరించారు. నిరసనలో గ్రామస్తులు చంద్రమూర్తి, విజయకుమార్, మంజునాథ, పెద్దణ్ణ, నాగరాజ్, వెంకటేశప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ రంగంలో రూ.8,400 కోట్ల ఒప్పందం

భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సెమీ కండక్టర్ రంగంలో నెదర్లాండ్స్ దేశానికి చెందిన ఎన్‌ఎక్స్‌పి సంస్థ రూ.8,400 కోట్ల పెట్టుబడులకు అంగీకరించిందని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బుధవారం హేగ్‌లో జరిగిన ఒప్పందాలపై మంత్రిత్వకార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 2025 జనవరిలో బెంగళూరులో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో పెట్టుబడుల ఆకర్షణకోసం యూరప్‌లో రాష్ట్రబృందం పర్యటిస్తున్నట్టు ప్రకటించారు. సెమికండక్టర్స్ పరిశోధనారంగానికి సంబంధించి ఎన్‌ఎక్స్‌పి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మౌరిన్ గెరిట్స్ పెట్టుబడులకు అంగీకరించారని పేర్కొన్నారు.



ఎన్‌ఎక్స్‌పీ సంస్థ ప్రతినిధులతో మంత్రి ఎంబీ పాటిల్

వృత్తిలో బాధ్యతగా వ్యవహరించాలి

శిడ్లఘట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు తమ వృత్తిలో బాధ్యతగా ఉండాలని ఓర్పుతో వ్యవహరించాలని న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జెఎంఎఫ్‌సి కోర్టు ఆవరణలో ఏర్పాటైన లాయర్స్‌డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్నివర్గాల వారికి ప్రామాణికంగా శ్రద్ధలతో వృత్తిలో ప్రగతి సాధించాలన్నారు. ఏదైనా కేసులో గెలుపోటములు ముఖ్యం కాదని వాదోపవాదాలలో వాస్తవాలు ప్రధానమన్నారు. కక్షిదారులకు తగిన సలహా సూచనలు అందించాలని అలాగే వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ న్యాయాధికారి పూజా, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి సీజీ భాస్కర్ ప్రసంగించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ



పోలీస్‌స్టేషన్ వద్ద కరపత్రాలతో ప్రజలు

బంగారపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని బంగారపేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్ దయానంద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని స్టేషన్ వద్ద ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. బాల్యవివాహాల నియంత్రణ, మహిళలు, బాలల హక్కులపై గురించి చట్టాలపై అవగాహన కల్పించారు. ఇదే సందర్భంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని తద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి, కార్యదర్శి సుజాత, కోశాధికారి వెంకటేశ్, సాంఘిక సంక్షేమశాఖకు చెందిన అంజలిదేవి, బీఈఓ జీ గురుమూర్తి, ఎస్సై రాజణ్ణ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయగౌడ, బీ నారాయణస్వామి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలు ఐటీఐలను దత్తత తీసుకోవాలి

మంత్రి శరణప్రకాశ్ పాటిల్

బెంగళూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలు ఐటిఐలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని తద్వారా సాంకేతిక నైపుణ్యత సాధ్యం కానుందని వారికి ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని వైద్యవిద్య, నైపుణ్యశాఖ మంత్రి శరణప్రకాశ్‌పాటిల్ అభిప్రాయపడ్డారు. బుధవారం ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో జరిగిన నైపుణ్యత - ఉద్యోగ అవకాశాలకు సంబంధించి వివిధ విద్యాసంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 10 ఐటిఐలను ఆధునీకరించి మెరుగైన సౌలభ్యాలు కల్పించాలని లక్ష్యం కలిగామన్నారు. ఐటిఐ సంస్థలను ఆధునీకరిస్తే విద్యార్థులకు అనుకూలం కానుందన్నారు. బెంగళూరు కలబురగితోపాటు పలు చోట్ల నైపుణ్య శిబిరాలు ఏర్పాటు చేయదలిచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 252 ప్రభుత్వ ఐటిఐ సెంటర్లలో 5వేలమందికిపైగా చదువుతున్నార న్నారు. ఇటీవలే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ ప్రకారం తుమకూరు, ముళబాగిలు, మాలూరు, పావగడ ఐటిఐ సంస్థలు ఉత్తమమైనవిగా గుర్తింపు లభించిందన్నారు.

హిందూవుల రక్షణకు సమాయత్తం కావాలి

- కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య స్వామి
- బంగ్లాదేశ్‌లో హిందూవులపై దాడులకు నిరసన

రాయచూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశలో దాడులకు గురవుతున్న హిందూవులకు రక్షణ కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం తగిన కార్యచరణ సిద్ధం చేయాలని స్థానిక కిల్లేబృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య స్వామి కోరారు. అదే సమయంలో ఆ దేశంలో హిందూవులకు రక్షణ కల్పించే దిశగా బంగ్లాదేశ్ ప్రభుత్వం పై కేంద్ర ఒత్తిడి తేవాలన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూవుల పై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బైఠాయించి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు హిందూ సంఘాల నాయకులు పాకిస్తాన్,బంగ్లాదేశలలో హిందూవుల జనాభా నానాటికి తక్కుపోతుండడం ఆందోళనకరమన్నారు. అక్కడి హిందూవుల పై దాడులు, దౌర్జన్యాలు, ఇంళ్లల్లో లూటీలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాధ్యతరాహిత్యమన్నారు. దేవాలయాలను ధ్వంసం చేస్తున్నారని, హిందూవుల పై దాడిని ప్రభుత్వం ముక్త కంఠంతో ఖండించాలని బాధితులైన హిందూవులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.



నిరసనలో హిందూ సంఘాల నాయకులు

తిరువణ్ణామలైకి కార్తీక శోభ



అలంకరణలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు



ధ్వజారోహణం చేస్తున్న శివాచార్యులు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో బుధవారం తెల్లవారుజామున ధ్వజారోహణంతో కార్తీక దీపోత్సవాలు ప్రారంభమయ్యాయి. తిరువణ్ణామలైలో ప్రతి ఏటా నిర్వహించే కార్తీక దీపోత్సవాలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. ఈ ఏడాది వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉన్న తంజై ప్రాకారంలో ఆలయ ప్రధాన శివాచార్యులు విశ్వనాథ గురుకల్ ధ్వజస్తంభంపై ధ్వజారోహణం చేశారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున 4 గంటలకు ఆలయంలోని మూలస్థానాలకు అభిషేకాలు చేసి, ఆలయంలోని మూలస్థాన దేవతామూర్తులకు మహాదీపారాధన నిర్వహించారు.

బెంగళూరుకు రెండు విమానాల మళ్లింపు

ఐసిఎఫ్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన రెండు అంతర్జాతీయ విమానాలను బెంగళూరు మళ్లించారు. మలేసియా, దుబాయ్ నుంచి నగరానికి వచ్చిన రెండు అంతర్జాతీయ విమానాలను హఠాత్తుగా బెంగళూరుకు మళ్లించారు. నిర్వహణ కారణాలతో విమానాలను బెంగళూరుకు మళ్లించినట్లు సమాచారం.

తేరుకుంటున్న 'ఫెంగల్' ప్రాంతాలు

అడయార్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న ప్రాంతాలు క్రమంగా కోలుకుంటున్నాయి. ఆ ప్రాంతాల ప్రజలు ఇపుడిపుడే తమ ఇళ్ళకు చేరుకుంటున్నారు. మరోవైపు వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఫెంగల్ ప్రభావంతో నవంబరు 29వ తేదీ నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు పలు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా, తిరువణ్ణామలై, కళ్ళకుర్చి, విల్లుపురం, కడలూరు, ధర్మపురి, సేలం, కృష్ణగిరి జిల్లాల్లో అపార నష్టం వాటిల్లింది. ముఖ్యంగా విల్లుపురం జిల్లా వ్యాప్తంగా ఏకంగా 63 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. వరద బాధిత ప్రాంతాల్లో గత మూడు రోజులుగా సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ జిల్లాలో తనెపెన్నై నదిలో వరద ఉధృతిలో చిక్కుకుని 14 మంది వరకు మరణించారు. ఇంకోవైపు ఈ ఈ నదిలో వరద నీటి ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు కూడా తగ్గుముఖం పట్టింది. కడలూరు జిల్లాలో పది వేలకు పైగా ఇళ్లు నీటిలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం పర్యవేక్షణలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

అర్ధ వార్షిక పరీక్షలు వాయిదా

ఫెంగల్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జరగాల్సిన అర్ధ వార్షిక పరీక్షలను జనవరికి వాయిదా వేసినట్టు పాఠశాల విద్యాశాఖా మంత్రి అన్బిల్ మహేశ్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అర్ధ వార్షిక పరీక్షలు ఈ నెల 2 నుంచి ప్రారంభంకావాల్సి ఉందన్నారు. అయితే, ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పలు జిల్లాల్లో అపారనష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితులు అనుకూలిస్తే ఈ నెల 9 నుంచి అర్ధసంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. అయితే, వరద బాధిత జిల్లాల్లో మాత్రం జనవరికి వాయిదా వేసినట్టు వెల్లడించారు.

పోప్ ఆశీస్సులు పొందిన స్పీకర్ యూటీ ఖాదర్



పోప్ ఫ్రాన్సిస్‌తో స్పీకర్ యూటీ ఖాదర్

బెంగళూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల మత గురువు పోప్ ఫ్రాన్సిస్‌ను కర్ణాటక శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ ఆశీస్సులు పొందారు. వ్యాటికన్‌సిటీలో పోప్‌ఫ్రాన్సిస్‌ను శాసనసభ స్పీకర్ భేటీ అయ్యారు. పరస్పర సామరస్యం, సౌహార్ద్రత భారత్‌లో నిరంతరం శాంతి ఉండాలని పోప్ అభిలషించినట్టు స్పీకర్ తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న స్పీకర్ పోప్‌ఫ్రాన్సిస్‌ను భేటీ అయ్యారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల సత్తా



మెడల్స్ పొందిన విద్యార్థులతో కోచ్

శిడ్లఘట్ట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్‌కు చెందిన విద్యార్థులు గౌరిబిదనూరు నేతాజి క్రీడా మైదానంలో నిర్వహించిన అమెచ్యూర్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్కేటింగ్ పోటీల్లో అండర్10, అండర్-12 విభాగంలో రాణించారు. నాలుగు ప్రథమస్థానం, రెండు ద్వితీయస్థానాలు, రెండు తృతీయస్థానాల్లో నిలిచి సత్తా చాటారు. నిరంజన్ 500 మీటర్లు, వెయ్యి మీటర్ల స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిత్విక్ 500, 1000 మీటర్ల స్కేటింగ్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచారు. మోహన్ 500, 1000 మీటర్ల స్కేటింగ్‌లో సత్తా చాటుకుని నిలిచాడు. అండర్12 విభాగంలో బాలికలు సైతం 500, వెయ్యి మీటర్ల స్కేటింగ్‌లో రాణించి ప్రథమ స్థానం నిలిచారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను బుధవారం ప్రత్యేకంగా సత్కరించారు.

ఆసుపత్రి సిబ్బందిపై దాడి

రోగి బంధువులపై కేసు



వాగ్వాదం చేస్తున్న మక్రమ్ పాషా

చింతామణి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న డాక్టర్ దాక్షాయణిని నిందించి దాడి చేయడమే కాక డి గ్రూప్ ఉద్యోగిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నవంబరు 27న చోటు చేసుకున్న ఘటనపై డిసెంబరు 3న పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నవంబరు 27న బుధవారం సాయంత్రం కడుపు నొప్పితో ఆసుపత్రిలో తాలూకాలోని మురుగమల్లా గ్రామానికి చెందిన అస్మా చేరింది. ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స అవసరమని గుర్తించి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఎమర్జెన్సీ విభాగం డాక్టర్ దాక్షాయణి సూచించారు. 108 అంబులెన్స్‌లో తీసు కెళ్లాలని సూచించగా అంబులెన్స్ రావడం జాప్యం కావడంపై అస్మా తండ్రి సయ్యద్ మక్రమ్‌పాషా, మరో వ్యక్తి గొడవపడ్డారు. ఇష్టం వచ్చినట్టు దూషించి డాక్టర్ దాడి చేసేందుకు యత్నించారు. ఆ సమయానికి డిగ్రూప్ ఉద్యోగి శ్రీనివాస్, వెంకటేశప్ప, డ్రైవర్ మంజునాథ్‌లు రాగా వారితో కూడా మక్రమ్‌పాషా గొడవపడ్డారు. ఘటనపై వైద్యులు, సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి డిసెంబరు 3న ఫిర్యాదు చేశారు.

తుఫాను ప్రభావంతో వర్షం



రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపునీరు

చేళూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో తుఫాను ప్రభావంతో నిరంతరం వర్షం కురుస్తోంది. బుధవారం కూడా వర్షం కురవడంతో పలు రోడ్లపై నీరు నిలిచింది. కొన్నిచోట్ల మురుగు కాలువలలో వర్షపునీరు సజావుగా ప్రవహించకపోవడంతో దుర్గంధం నెలకొంది. ఈ నేపథ్యంలో కాలువలలో పూడిక తీసి వర్షపునీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, గుంతలరోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బండరాయి పడి ప్రహరీ ధ్వంసం

చెన్నై, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరిలోని పాతపేట కొండపై నుండి ఓ పెద్ద బండరాయి జారిపడి ఓ ఇంటి ప్రహరీ ధ్వంసమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ కొండపై తరచూ మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. బుధవారం ఉదయం ఆ కొండపై నుంచి బండరాయి దొర్లుకుంటూ మేల్‌వీధిలో నివసిస్తున్న వెంకటాచలం అనే వ్యక్తికి చెందిన ఇంటి ప్రహరీపై పడింది. ఈ సంఘటనలో ప్రహరీగోడ పూర్తిగా ధ్వంసమైంది. ఆ బండరాయి మరికాస్త ముందుకు జారి పడి ఉంటే ఇంటిలో ఉన్న వెంకటాచలం, భార్యా పిల్లల ప్రాణాలకు ముప్పు కలిగిఉండేది. సమాచారం అందుకుని తహసీల్దార్ వలర్మతి, ఎస్పీ మురళి ఇతర అధికారులు ఆ స్థలానికి వెళ్ళి విచారణ జరిపారు.



ప్రహరీపై పడిన బండరాయి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.61	1,592.49
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,246	853
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,224	1,958
నీటి నిల్వ (టీఎంసీలు)	92.61	13.24

ఎవరికి చెప్పుకోవాలి..?

● వరి రైతుకు అన్నీ కష్టాలే ● ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు ● కోసిన ధాన్యానికి వర్షం ముప్పు



కొనుగోలు కేంద్రం ఎదుటే ధాన్యం ఆరబోసిన రైతులు

బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి కొనుగోళ్లపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సిరుగుప్ప తాలూకాలో మూడు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన జిల్లా యంత్రాంగం సిరుగుప్పలో మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప చేపట్టిన నిరాహార దీక్షా కేంద్రంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కరూర్, హచ్చళ్ళి సహా నగరంలో వరి కొనుగోలు కోసం రిజిస్ట్రేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని తాలూకా పరిపాలన హామి ఇచ్చింది. కానీ కరూరు, హచ్చొళ్ళి రైతుల నమోదుకు, కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులకు ఎలాంటి సన్నాహాలు లేవు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. కనీస మద్దతు ధర పథకం కింద వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నమోదు చేసుకున్న రైతులకు ఎలాంటి సమాచారం అందండం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరూరు, హచ్చొళ్లిలోయ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నమోదు చేసుకునేలా అధికారులు రైతులకు సౌకర్యాలు కల్పించాలని, లేకపోతే మళ్ళీ పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నారు.

వరికోతకు వెనుకాడుతున్న రైతులు

జిల్లాలో మూడు రోజులుగా మేఘావృతమైన వాతావరణం, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో సాగు చేసిన వరిపంట చేతికొచ్చిన కోత కోయడానికి రైతులు వెనకాడుతున్నారు. జిల్లాలో వరి ప్రధాన వాణిజ్య పంట గత 25రోజులుగా ప్రారంభమైన కోత పనులు మరో 10-15రోజుల పాటు కొనసాగనుండగా..... ఫెంగల్ తుపాన్‌తో కురిసిన వర్షంతో వరి కోతలు కేసేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం మేఘావృతమైఉండటంతో రైతులు వరి కోతలు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. తమిళనాడు తీరాన్ని తాకిన తుపాన్ ఆంధ్రా, కర్నాటక మీదుగా వస్తిరించడం తుపాన్ ప్రభావం జిల్లాలో కనిపించింది. తరచుగా కురుస్తున్న జల్లులతో వరి కోతలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షంలో వరి పంట కోస్తే పొలంలో ఎండబెట్టాలి. లేకుంటే కొనుగోలుదారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారన్నకారణంతో రైతులు వరి కోతకు సిద్ధంగా లేరు.వరిని సకాలంలో కోయకుంటే కోత ఆలస్యం అయితే ధాన్యం రాలిపోమే అవాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో కొంతమంది రైతులు మే ఘావృతమైన వాతావరణంలో పంటలు కోస్తున్నారు. మొత్తం మీద ఫెంగల్ తుపాన్ వరి పంట కోతకు అంతరాయం కలిగించింది.



కోతకు సిద్ధంగా వరి చేను



టార్పాలిన్ కప్పి ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు

అన్నదాతను దడ పుట్టిస్తున్న ఫెంగల్ తుఫాన్

కంప్లి : మూడు రోజులుగా జిల్లా రైతులను తుఫాన్ దడ పుట్టిస్తోంది. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులకు కష్టాలే మిగిలాయంటూ రైతు సంఘం హసురుసేన తాలుకా అధ్యక్షుడు తిమ్మప్ప ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని, రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో ధాన్యం రాశులుగా పోసుకున్న రైతులకు ఆందోళన మొదలయ్యిందని అన్నారు. కొనుగోలు దారుల కోసం ఏపీఎంసీ ఆవరణంలో కుప్పలు పోసుకుని ఎదురు చూస్తున్నామని తెలిపారు. తుఫానుతో పాటు గిట్టబాటు ధరలు లేక రైతులు పూర్తిగా సతమతమవుతున్నారన్నారు. దీనికి తోడు ఈ వర్షప్రభావంతో పూర్తిగా పంటలు కూడా నేలకొరిగాయి. ఈ యేడాది ఖరీఫ్ తమకు కష్టాలనే మిగిల్చిందన్నారు. కనీసం పెట్టుబడులు కూడా రావని ఆవేదన్య వ్యక్తం చేశారు. ధాన్యం సాగుతో లాభాలు లేకుండా పోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దిగివచ్చి ఏపీఎంసీ ఆవరణంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కంప్లి పరిధిలోని రామసాగరం, దేవసముద్రం, జానూరు, ముద్దాపురం, ఎమ్మిగనూరు, తదితర భాగాల రైతన్నలు పూర్తిగా పంటలు నేలకొరిగి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కోత మిషన్లకు విపరీతమైన డిమాండ్ పలుకుతోందన్నారు. సొంత రైతు మాత్రం అంతంత మాత్రంగానే సరిపోతుందని, కౌలు రైతు మాత్రం పూర్తిగా నష్టాలు తప్పవని వాపోయారు.

యువనిధికి నమోదు చేసుకోండి

: జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప



బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హామీల్లో ఒకటైన 'యువనిధి' పథకానికి అర్హులైన గ్రాడ్యుయేట్లు , పోస్ట్ గ్రాడ్యుయేట్లు, డిప్లమా గ్రాడ్యుయేట్లు పేర్లు నమోదు చేసుకోవచ్చని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపథకం కింద గ్రాడ్యుయేట్లకు రూ.3000, డిప్లమా గ్రాడ్యుయేట్లకు రూ.1500 అందజేస్తారు. 2023-24, 2024-25 గ్రాడ్యుయేషన్ , పోస్టుగ్రాడ్యుయేషన్, డిప్లమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్‌లైన్ సింధు పోర్టల్ , అటల్ జీ కేంద్రం, కర్ణాటక-1, బళ్లారి-1 ఇతర సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రాడ్యుయేషన్, డిప్లమా తర్వాత కనీసం 6నెలలు(180) రోజుల వ్యవధిలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం లేదా స్వయం ఉపాధి కలిగి ఉండకూడదు. ఉన్నత విద్యను అభ్యసించని వారు అర్హులు, కర్ణాటక నివాసి(కనీసం 6సంవత్సరాలు డిగ్రీ,డిప్లోమా చదివినవారై ఉండాలి.

అవసరమైన పత్రాలు

పదవతరగి, పీయూసీ, డిగ్రీ డిప్లమా సర్టిఫికేట్, ఆధార్‌కార్డు,ఆదార్ సీడెడ్ బ్యాంక్ ఖాతా నంబరు, అధార్‌లింక్ మొబైల్ నంబరు. ప్రతినెల 25వ తేదీలోపు సేవాసింధు పోర్టల్‌లో సెల్ఫ్ అటెస్టెడ్ నిరుద్యోగ ధృవీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి అన్నారు. యువనిధి పథకం కింద నమోదు చేసుకోవడానికి ఏదైనా సమస్య ఉంటే హెల్ప్‌లైన్ నంబర్లు 18005999918, 18005997154కు కాల్ చేయవచ్చు. మరింత సమాచారం కోసం నగరంలోని పాత తాలూకా కార్యాలయం వెనుక ఉన్న జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ కార్యాలయంలో లేదా సెల్ నెంబర్ 974718891, 8277000619, 9900827768, 8861866752 సంబంధిత యూనివర్శిటీని సంప్రదించవచ్చన్నారు.

యువతి ఆత్మహత్య

రాయదుర్గం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పైతోట ఏరియాలో రైలు నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడం పట్టణానికి చెందిన తనూజ(20) మెడికల్ సీటు రాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందింది. ఈక్రమంలోనే మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పింది. కుటుంబసభ్యులు ఆందోళన చెంది కర్ణాటకలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఆమె ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బుధవారం ఉదయం పైతోట సమీపంలో రైల్వే గ్యాంగ్‌మెన్ నాగేష్ ఓ యువతి మృతదేహం చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వేపోలీసులు ఆ యువతి వివరాల కోసం దర్యాప్తు చేపట్టగా, అది తనూజ మృతదేహంగా గుర్తించి ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



తనూజ (ఫైల్)

బాలింతల మృతిపై జేడీఎస్ బృందం ఆరా



జిల్లా ఆసుపత్రిని సందర్శించిన జేడీఎస్ ప్రతినిధుల బృందం

బళ్లారి సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జేడీఎస్ ప్రతినిధి బృందం బుధవారం జిల్లాఆసుపత్రి, బిమ్స్ ఆసుపత్రిలో బాలింతల మృతిపై జేడీఎస్ బృందం ఆరా తీసింది. బుధవారం జేడీఎస్ ఎమ్మెల్యేలు సురేష్ బాబు, నేమిరాజ్‌నాయక్, కరీమమ్మ,మాజీ ఎమ్మెల్యే నాడగౌడ తదితరులు ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతల వరుస మరణాలకు వైద్యులు , ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. నాసిరకం మందుల కారణంగానే బాలింతలు మృత్యువాత పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేక్ కంపెనీ ముందుల సరఫరా చేసేందుకు ఎందుకు అనుమతించారు? కనీసం జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి ఈవిషయంపై స్పందించలేదని విమర్శించారు. పేదల వైద్యంపై నిర్లక్ష్యం పనికి రాదన్నారు. తల్లులను కోల్పోయిన పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కనీసం రూ.25లక్షలు ఇవ్వాలన్నారు. బళ్లారితో పాటు సింధనూరులోనూ బాలింతలు మృత్యువాత ఘటనపై విచారణ జరపాలన్నారు. జిల్లాఆసుపత్రిలో డాక్టర్ బసారెడ్డి బాలింతల వరుస మరణాలపై వైద్యుల నుంచి సమాచారం అందుకున్నారు. బాలింతల వార్డును సందర్శించి కొంతమంది బాలింతలతో మాట్లాడారు.

ఉత్కంఠ రేకెత్తించిన ఉద్యోగ సంఘం ఎన్నికలు

● కర్ణాటక రాష్ట్ర పరిషత్ నాయకుడిగా ఎం.సురేష్ కుమార్ విజయకేతనం



విజేతలను అభినందిస్తున్న సభ్యులు



ఫలితాల కోసం ఉత్కంఠంగా ఎదురు చూస్తున్న ఉద్యోగులు

బళ్లారి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఉత్కంఠను రేకెత్తించాయి. బుధవారం జరిగిన ఎన్నికల్లో కర్ణాటక రాష్ట్ర పరిషత్ సభ్యుడిగా ఎం. సురేష్ కుమార్ విజయకేతనం ఎగరవేశారు. జిల్లా సభ్యులుగా ఆసీఫ్.ఎం.ఎ, హనుమంతరాయ గెలుపొందారని ఎన్నికల నిర్వహణాధికారి కే. అంజినప్ప తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 68 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో రెండు ప్యానల్స్ నుంచి ఆరుగురు బరిలో నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పరిషత్ సభ్యత్వంకు ఎం. సురేస్‌బాబు (గ్రామ అడలిత అధికారి)పోటీ చేశారు. అయనపై మహంతేశ పోటీ లో నిలిచారు. మొత్తం 68 ఓట్లుకు గాను సురేష్ కుమార్‌కు 41 ఓట్లు తో విజయం సాంధించారు. జిల్లా అధ్యక్షస్థానానికి ఎం.ఎ అసీఫ్ పోటీ చేసి 43 ఓట్లతో విజయం సాధించారు. ట్రెజరర్‌గా ఆరోగ్య శాఖ విభాగంలో పనిచేస్తున్న హనుమంతరాయ 42 ఓట్లు పోల్ అయ్యాయి. బుధవారం ఉదయం ఈ ఎన్నికలు డీసీ కార్యాలయ ఆవరణంలోని ఉద్యోగసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. పోలీసుల భద్రత నడుమ జరిగిన ఎన్నికలు సాయంత్ర ఓట్లు లెక్కించారు. ప్యానల్‌లో ముగ్గురు విజయం సాధించారు. విజయం సాధించిన వెంటనే రాష్ట్ర పరిషత్ నాయకుడు సురేష్ కుమార్‌ను తోటి ఉద్యోగులు సత్కరించారు. అలాగే గెలిచిన వారు అంతా సంబరాలు జరుపుకున్నారు.

ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు న్యాయం

రాయచూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందని ఎయిమ్స్ స్థాపక ఏర్పాటు కోసం సాగిస్తున్న ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం అఖిల పక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష బుధవారం 937వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధి స్టేడియంలోని దీక్ష శిబిరం వద్ద ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు దీని పై నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు.



నగరంలోని స్టేడియం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

ఐటీఐ కళాశాలకు భూమిపూజ

కంప్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కూడ్లిగి తాలుకా గుడేకోటలో రూ. 13 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఐటీఐ కళాశాల నిర్మాణానికి కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాస్ బుధవారం భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఐటీఐ కళాశాల లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, పొరుగు తాలుకాలోకి, పట్టణాలకు వెళ్లేవారన్నారు.. విద్యార్థులను దృష్టిలో వుంచుకుని ఇక్కడ ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ కళాశాల ఏర్పాటు పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



భూమిపూజలో ఎమ్మెల్యే శ్రీనివాస్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

రాయచూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైయ్యారు. లింగసుగూరు తాలూకా హొసగుడ్డా గ్రామానికి చెందిన బసవరాజ్(25) బైక్ పై వెళుతుండగా జాలహళ్ళి-రాయచూరు మార్గంలో ఎదురుగా హెచ్‌పీ గ్యాస్ సిలెండర్‌ల లోడ్‌తో వస్తున్న లారీ ఒకటి ఢీ కొట్టడంతో బసవరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మరో రోడ్డు ప్రమాదంలో జాలహళ్ళి గ్రామానికి చెందిన దుర్గమ్మ రాంపల్లి 72 ఏళ్ల వృద్ధురాలు బస్సు ఢీకొని మృత్యువాతపడింది. కృష్ణనది తింథిణి బ్రిడ్జి వాల్మీకి సర్కిల్ వద్ద దుర్గమ్మ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి మహిళను ఢీ కొట్టింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన జాలహళ్ళి పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడి నియామకం



మారుతీ వరప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

సిరుగుప్ప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్యారెంటీ పథకాల కమిటీకి తాలుకా అధ్యక్షుడిగా మారుతి వరప్రసాద్‌రెడ్డి నియామకమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు గ్యారెంటీ పథకాలను జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారుతీ వరప్రసాదరెడ్డి బుధవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. గృహజ్యోతి, గృహలక్ష్మీ, మహిళాశక్తి, యువతకు ఉపాధి, రేషన్ బియ్యంకు సంబంధించి బ్యాంకు ఖాతాకు నగదును జమ చేయడం వంటి పథకాలను ప్రభుత్వం జారీ చేసింది. ఈ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందకపోతే ఈ కమిటీ సభ్యులకు తెలియజేసి ఈ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని మారుతీ వరప్రసాద రెడ్డి తెలిపారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆయన్ని ఘనంగా సన్మానించారు.

కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించాలి : ఎమ్మెల్యే

కంప్లి, డిసెంబరు 4(ఆంధ్ర జ్యోతి) : తమకు ఇచ్చిన పనుల్లో నాణ్యత వలనే కాంట్రాక్టర్లకు గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్ఎన్ పేట కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినా రాజకీయ విబేధాలకు తావు లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. తాలుకా అధ్యక్షుడు నాగభూషణ మాట్లాడుతూ కలసికట్టుగా వుంటూ సంఘం అభివృద్ధికి పాటు పడాలన్నారు. స్థానిక కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధికారి గౌరవాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రమేష్, ప్రధాన కార్యదర్శి ఎన్ తిప్పయ్య, కోశాధికారి బాలేసాబ్, రామాంజినేయులు, సుదర్శన్‌రెడ్డి, తిమ్మారెడ్డి, సుధాకర్, షణ్ముఖప్ప, శ్రీనివాసరావు, హేమయ్యస్వామి, బట్టా ప్రసాద్, నాగరాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

హోసూరు జోన్

చెరువులో చేపల మృత్యువాత



గోవింద అగ్రహార చెరువులో తేలుతున్న చేపలు

హోసూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలో గోవింద అగ్రహారం ప్రాంతంల్లో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో బత్తలమ్మన సరస్సు నుంచి నీటిపారుదల కోసం నీటిని వినియోగిస్తున్నారు. ఈ సరస్సులో చేపల పెంపకం కోసం ఏటా వేలం నిర్వహిస్తారు. సరస్సు చుట్టూ వందలాది నివాస ప్రాంతాలు, చిన్న సంస్థలు ఉన్నాయి. ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థాలు చెరువులోకి చేరుతున్న కారణంగా నీరు కలుషితం అయ్యింది. దీనిపై ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణ కూడా ఉంది. ఈ తరుణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డంప్ చేసిన రసాయన వ్యర్థాలతో పెంచిన చేపలు చనిపోయి తేలుతున్నాయి. తద్వారా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని తీవ్ర ఆరోగ్య సమస్యలు స్థానికులు వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆశాజనకంగా కంది పంట

హోసూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో కందిపంట ఆశాజనకంగా ఉంది ప్రస్తుతం రైతుబజారులో కిలో రూ.50-70 వరకు పలుకుతోంది. కొలదాసపురం గ్రామంలో 42 హెక్టార్లలో, నందిమంగలం గ్రామంలో 40 హెక్టార్లు, పలవనపల్లి గ్రామంలో 40 హెక్టార్లు, ఎస్, ముదుగానపల్లి గ్రామంలో 74 హెక్టర్లు, పంచాక్షీపురం, ముగులూరు, గోపనపల్లి, అంచెట్టి, ఒన్నలవాడి తదితర గ్రామాల్లో 1235 హెక్టార్లలో పిఆర్‌జీ 1, ఎల్‌ఆర్‌జీ 1, ఎల్ ఆర్‌జీ 52 వంటి దువర్ రకాలను సాగు చేస్తారు. మే, జూన్ నెలల్లో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం కోతకు వస్తోంది. ఎకరానికి 500 - 600 కిలోల పచ్చి కాయలు, 8రోజుల వ్యవధిలో ఎకరానికి మూడు నుంచి నాలుగు సార్లు కోస్తారు. కొన్ని వారాలుగా హోసూరు రైతుబజారులో కందికాయలు, ఆకుకూరలు కిలో రూ.50 - రూ.70 వరకు పలుకుతోంది.



కందిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఫెంగల్ తుఫాన్ బాధితులకు ఆరు శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ముత్తుస్వామి

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా నిరంతరంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల వాసులు, ఇతర ప్రాంతాల వాసులకు 6 శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో కొనసాగుతున్న శిబిరాలపై కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గృహనిర్మాణ, పట్టాణాభివృద్ధి శాఖ మంత్రి ముత్తుస్వామి నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. బుధవారం ఏర్పాటైన సమావేశానికి జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, వై.ప్రకాశ్ అధ్యక్షత, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్ అధ్యక్షత నిర్వహించారు. ఫెంగల్ తుఫాను కారణంగా డిసెంబరు 1న రాత్రి కురిసిన భారీ వర్షంతో కృష్ణగిరి జిల్లాలో ఊత్తంగరై, పోచ్చంపల్లి సర్కిల్‌లల్లో భారీ నష్టం కలిగింది. రెండు రోజులుగా బాధిత ప్రాంతాలను నేరుగా స్వయంగా సందర్శించి పరిశీలించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఇక్కడి పరిస్థితి ఐదుసార్లు ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ అధికారులు పగలు, రాత్రి సహాయక చర్యలు చేపట్టారు. అలాగే బాధిత ప్రాంతాల్లో 7 చోట్ల సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహారంతోపాటు మౌలిక వసతులు కల్పించారు. జిల్లావ్యాప్తంగా 50 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సహాయం అందిస్తున్నారు. తమిళనాడు ఉపముఖ్యమంత్రి డిసెంబరు 2న స్వయంగా సహాయ శిబిరాల్లో ఉన్న పౌరులకు సహాయ వస్తువులతో కూడిన ప్యాకేజీలను పంపిణీ చేశారు. ఇలాంటి సంఘటనలు ఏడాదికో రెండేళ్లకో ఒకసారి జరిగితే ముందుజాగ్రత్తగా పరిష్కార చర్యలు చేపడతారు. అయితే 50 ఏళ్ల తర్వాత తుఫానుతో భారీ వర్షం కురిసింది. మళ్లీ ఇలాంటి భారీ వర్షపు సమస్యలకు శాశ్వత పరిష్కారం వెతకాల్సి ఉందని, దీనిని ఒక అనుభవంగా తీసుకుని, ప్రజాసమస్యలు ఏవైనా ఉన్నా వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ 12సమస్యలకు సంబంధించిన వివరాలను తెలపగా మరో 10 సమస్యలు ప్రస్తావించారు. ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న పంటపై అంచనా, మేకలు ఆవులు సహా పశువుల వివరాలను సేకరించి వాటి యజమానులకు పరిహారం ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా పోలీసు సూరింటెండెంట్ తంగదురై, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురశ్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రోగ్రామ్ పి.పెరియస్వామి, జిల్లా కలెక్టర్ జనరల్ పి.పుష్ప, కృష్ణగిరికి ఇంటర్వ్యూ అసిస్టెంట్ దేవదాయ శాఖ కమీషనర్ షాజహాన్, జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షుడు మణిమేగలనాగరాజు, కృష్ణగిరి జిల్లా సంస్థ అధ్యక్షురాలు నవాబ్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.